

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.5, కనిష్ఠం 24.8



మధ్యాహ్న భోజన వివరాలను రోజువారిగా నమోదు చేయాలి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 22: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన వివరాలను రోజువారిగా అప్‌డేట్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. చాలామంది ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు ఎండీఎం మొబైల్ యాప్‌లో వివరాల ను అప్‌డేట్ చేయడం లేదని దానివల్ల బడ్జెట్ విడుదల చేయడం ఆలస్యం అవుతుందన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 1గంటలోపు యాప్‌లో వివరాలను అప్‌డేట్ చేయాలని ఆయన తెలిపారు.

అక్రమార్కులకు అండదండలు!





ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

- నగరంలో భూ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు కరువు
- ప్రజాప్రతినిధుల సహకారంతో యథేచ్ఛగా నగరంలో భూ కబ్జాలు
- బొందలగడ్డ చెరువు ఆక్రమణలను తొలగించినా.. అసలైన వారిపై కేసులు లేవు
- ఎమ్మెల్యేతో సహా ప్రతిపక్షాలు ఆరోపణలు చేసినా.. పూర్తిస్థాయి చర్యలు కరువు
- నగరంలో కబ్జాలకు పాల్పడుతున్న వారికి అండగా నిలుస్తున్న కొందరు అధికారులు

నిజామాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరంలోని భూ అక్రమాలకు పాల్పడుతున్న అసలైన వ్యక్తులపై చర్యలు లేవు. కేసులు లేవు. ప్రభుత్వ, అసైన్డ్ భూములను కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయించి అమ్మకాలు చేస్తున్నా.. పట్టించుకునేవారు లేరు. కనీసం వారిపై కేసులు నమోదు కూడా చేయడం లేదు. ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటం.. ఏళ్లతరబడి పదవుల్లో ఉండటం వల్ల చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పేదల కోసం కేటాయించిన భూములను కబ్జాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. పలు దఫాలు సర్వేలు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదికలను ఇచ్చినా ఫలితం లేదు. నిజామాబాద్ నగరం పరిధిలోని బొందలగడ్డ చెరువులో ఆక్రమణలను తొలగించిన అధికారులు.. పేదలను మోసం చేసిన వారిపై కేసులు పెట్టలేదు. ఆ భూములు కొన్న నిరుపేదలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ భూముల అమ్మకాలకు అసలైన కారకులపై చర్యలు తీసుకోలేదు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు శిఖం ఆక్రమించడమే కాకుండా మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఇంటి నెంబర్లు కేటాయించిన వారిపై చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ అమ్మకాలపై కీలకమైన వారికి ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటంతో వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. నగరంలో బఫర్ జోన్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేస్తున్నా పట్టింపు లేదు. టౌన్‌ప్లానింగ్ నుంచి మున్సిపల్ అధికారుల వరకు అనుమతులు ఇస్తున్నారు. కనీసం రోడ్లకు కూడా స్థలాన్ని వదిలి వేయకున్నా పట్టించుకోవడం లేదు. వర్షాలు వచ్చిన సమయంలో కబ్జాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నా కనీసం చర్యలు తీసుకోవడం లేదు.



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

బొందలగడ్డ చెరువు శిఖంలో అక్రమాలు

నిజామాబాద్ నగరం బొందలగడ్డ చెరువు శిఖం అక్రమాలను అధికారులు వారం రోజుల క్రితం పరిశీలించారు. అయినా ఇప్పటి వరకు అక్రమాలకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలను తీసుకోలేదు. చెరువు శిఖం ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్మకాలు చేసిన వారిని పట్టించుకోలేదు. ఇళ్లు కోల్పోయిన వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొంత మందిపై పోలీసులు కేసు నమోదు చేసినా ఈ వ్యవహారంలో కీలకమైన వారిని వదిలిపెట్టినట్లు నగర ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో పాటు వామపక్ష నేతలు ఆరోపణలు చేస్తున్నారు. చెరువు శిఖంను ఆక్రమించి ప్లాట్లుగా చేసి అమ్మకాలు చేసిన సమయంలోనే ఇరిగేషన్ అధికారులతో పాటు మున్సిపల్, రెవెన్యూ శాఖ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించిన ట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెరువు శిఖం భూమిని కబ్జా చేయడంతో పాటు మున్సిపల్ నుంచి ఇంటి నెంబర్లను కేటాయింపు చేశారు. ఆ నెంబర్ల ఆధారంగా పేదలకు అమ్మకాలు చేశారు. రెండు మూడు లక్షలు పెట్టి ఈ ప్లాట్లను కొనుగోలు చేసిన వారు ఇళ్లను నిర్మాణం చేసుకున్నారు. ఈ భూముల కబ్జాల వెనక ఉన్న పెద్దలు మున్సిపల్ నుంచి ఇళ్ల నెంబర్లు ఇప్పించడంతో పాటు కరెంటు డిపార్ట్‌మెం ట్ నుంచి ప్రత్యేకంగా పోల్స్‌ను వేయించి విద్యుత్ సరఫరా చేశారు. ఇళ్లకు మీటర్లను మంజూరు చేశా రు. చెరువు శిఖం పరిధిలో గత కొన్ని నెలలుగా ఈ వ్యవహారం జరుగుతున్నా ఆయా శాఖల అధికారు లు పట్టించుకోకపోగా సహకరించడంతో ఈ ప్లాట్ల ను అమ్మకాలు చేశారు. వీటిపైన ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అధికారులు కూల్చివేశారు. ఈ ప్లాట్లను కొనుగోలు చేసిన పేదలు మాత్రం నష్టపోయారు. ఈ ప్లాట్ల వెనక రెండు పార్టీలకు చెందిన కీలక నేత లు ఉండటం వల్లనే వారివైపు చూడనట్లు ఆరోపణ లు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంతో పాటు ఇప్పుడు కూడా వారే చక్రం తిప్పుతుండటం తో కనీసం పట్టించుకునేవారు లేరు. నగరం పరిధి లో ఇలానే గతంలో కూడా ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లను కబ్జా చేశారు. వివిధ వర్గాలకు అమ్మకాలు చేశారు. ఆ సమయంలో కూడా నిరసనలు వెల్లువెత్తిన పట్టించుకోలేదు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను మార్పు చేసి నకిలీ పట్టాలను సృష్టించి అమ్మకాలు చేశారు. పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలను కొల్లగొట్టారు. ఆ సమయంలో కూడా అప్పటి కలెక్టర్ చొరవ చూపడంతో నాలుగు రోజుల పాటు సర్వే నిర్వహించి భూములను స్వాధీనం చేసుకున్నారు.

నగర పరిధిలో కబ్జాలు

నిజామాబాద్ నగరం పరిధిలోని నాగారం, బాబన్‌సాహెబ్‌పాడ్, ధర్మపురిహిల్స్, అర్సపల్లి, బోర్గాం, ముబారక్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో కబ్జాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతాలను చెరువులు చా లా వరకు కబ్జాలు అయ్యాయి. శిఖం భూముల్లో నిర్మాణాలు వెలిశాయి. అధికారులు పట్టించుకోవాల్సి ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వీరికి రాజకీయ అండదండలు ఉండటం వల్ల ఈ పరిస్థితి కొనసాగుతోంది. నగరంలో కొన్నేళ్లుగా చెరువులు, కుంటలు కబ్జాలకు గురయ్యాయి. వీటి పరిధిలో భవనాలతో పాటు ఇతర నిర్మాణాలు వచ్చాయి. పా త పట్టాలను తమ ముత్తాతల పేరుమీద సృష్టించి ఈ భూములను కబ్జా చేశారు. ప్లాట్లుగా చేసి అమ్మకాలను చేశారు. కోట్ల రూపాయల విలువ చేసే భూములు కబ్జాకు గురైన పట్టించుకోలేదు. చెరువులకు సంబంధించి రెండేళ్ల క్రితం అప్పటి అధికారులు వివరాలు సేకరించగా ఈ విషయం బయటపడింది. హైదరాబాద్‌లో హైడ్రా చేపట్టిన విధంగా నగరం పరిధిలో కూడా అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపిస్తే చెరువుల భూ ములతో పాటు ప్రభుత్వ భూములు స్వాధీనం అయ్యే అవకాశం ఉంది. రాజకీయ నేతలకు ప్రజాప్రతినిధుల అండఉండటం వల్ల ఇది సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. కబ్జాలు చేసేవారిపై కేసులు నమోదు చేయడంతో పాటు చర్యలు చేపడితే భవిష్యత్తులో అక్రమాలు తగ్గే అవకాశం ఉంది.

బోధన్, బాన్సువాడ సబ్ డివిజన్లకు సబ్ కలెక్టర్ల నియామకం

నిజామాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం బోధన్, బాన్సువాడ రెవెన్యూ డివిజన్లకు ఐఏఎస్ అధికారులను సబ్ కలెక్టర్లుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులను జారీ చేశారు. బోధన్ సబ్ కలెక్టర్‌గా 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వికాత్ మహతోను నియమించింది. అక్కడ పనిచేస్తున్న ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్‌ను బదిలీ చేసింది. ఐఏఎస్ శిక్షణ ముగించుకున్న ఆయనను బోధన్ సబ్ కలెక్టర్‌గా నియామకం చేశారు. కొన్నేళ్లుగా బోధన్‌కు ఆర్డీవోను నియ మించగా ప్రభుత్వం ప్రస్తుతం ఐఏఎస్‌ను నియమించింది. కొత్తగా ఏర్పడిన బాన్సు వాడ రెవెన్యూ డివిజన్‌కు ఇప్పటి వరకు ఆర్డీవో స్థాయి అధికారిని నియమించారు. కొత్తగా కిరణ్మయి కొప్పిశెట్టి 2022 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిని సబ్ కలెక్టర్‌గా నియమించారు. నిజామాబాద్ జిల్లాలోనే ట్రెయినీ కలెక్టర్‌గా ఆరు నెలల పాటు పని చేశారు. అక్కడ పనిచేస్తున్న ఆర్డీవో రమేష్ రాథోడ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు సబ్ డివిజన్లకు కొత్తగా 2022 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులను నియమించింది.



కిరణ్మయి కొప్పిశెట్టి



వికాత్ మహతో

వివాదాల పరిష్కారంలో మీడియేటర్లది క్రియాశీలక పాత్ర

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే

నిజామాబాద్ లీగల్, ఆగస్టు 22: సామాజిక వివాదాల సత్వర పరిష్కారంలో కమ్యూనిటీ మీడియేటర్లు క్రియాశీలక పాత్ర పోషిస్తారని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే అన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో తొలిసారిగా 2021లో కమ్యూనిటీ మీడియేటర్ వ్యవస్థను ప్రవేశపెట్టి మంచి సత్ఫలితాలు సాధించడంతో దీనిని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రంలో తొలిసారిగా పైలెట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లాలో ఈ మధ్యవర్తిత్వ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామన్నారు. వివిధ సామాజిక వర్గాల నుంచి కమ్యూనిటీ మీడియేటర్లుగా ఎంపిక చేసి వారికి గురువారం జిల్లా కోర్టు సముదాయంలో లీగల్ అథారిటీ సమావేశంలో శిక్షణ తరగతులను ప్రారంభించారు. జిల్లా న్యాయసేవా సంస్థ సమన్వయంతో రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 24 వరకు మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ శిక్షణ తరగతులను వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర హైకోర్టు జస్టిస్ లాంఛనంగా ప్రారంభించగా.. హైకోర్టు న్యాయమూర్తులు సుజయ్‌పాల్, కె.సురేందర్, జె.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. సామాజిక వివాదాలకు కుటుంబ తగాదాలే ఎక్కువ కారణమని మధ్యవర్తుల ద్వారా ఇరువర్గాల ఆమోద్యయోగ్యమైనరీతిలో పరిష్కరించుకునేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయాధికారులు, కలెక్టర్, సీపీ

దీనివల్ల సమాజంలో వివాదాలు తగ్గుముఖం పడతాయని అన్నారు. అనవసర ఖర్చులతో పాటు సమయం వృధా కూడా కాకుండా అరికట్టవచ్చని అన్నారు. శిక్షణ పొందిన వలంటీర్లు తమ తమ ప్రాంతాల్లో మీడియేషన్ సెంటర్లు ఏర్పాటు చేసుకొని వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిగా చొరవ తీసుకొని వారికి తగు విధంగా సమస్య పరిష్కారానికి సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ప్రయోగాత్మకంగా అమల్లోకి తెస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం రీసోర్స్‌పర్సన్ రిటైర్డ్ సెషన్ జడ్జి మహ్మద్ షమీమ్, రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి పంచాక్షరి, జిల్లా సెషన్ జడ్జి సునీత కుంచాల, కామారెడ్డి జిల్లా సెషన్ జడ్జి బీఆర్ ఆర్ వరప్రసాద్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్, ఉమ్మడి జిల్లా జడ్జీలు, న్యాయవాదులు, కమ్యూనిటీ వలంటీర్లు పాల్గొన్నారు.



- కార్యక్రమానికి హాజరైన న్యాయాధికారులు, వలంటీర్లు

ఆ వార్డెన్ లీలలెన్నో !?



- బదిలీ అయిన డీఎస్సీడీవో అండతో అక్రమాలు
- బియ్యం అమ్ముకున్న కేసులో చర్యలు కరువు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 22: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షల కోసం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో అనేక అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. బదిలీపై వెళ్లిన డీఎస్సీడీవో శశికళ అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వందమంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వగా పురుష అభ్యర్థుల కోసం ప్రైవేటు భవనాన్ని అద్దెకు తీసుకున్నప్పటికీ మహిళా అభ్యర్థులను మాత్రం సుభాష్‌నగర్‌లోని సి-హాస్టల్‌లో ఉంచినట్లు సమాచారం. అందులో కేవలం 15మంది మహిళా అభ్యర్థులు మాత్రమే ఉండగా మిగిలిన వారు ఇళ్లకు వెళ్లి కోచింగ్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ మొత్తం వందమందికి వసతి కల్పించినట్లు చూపించి లక్షలాది రూపాయల బిల్లులు కాజేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మూడు నెలల కోచింగ్, ఆరు నెలల కోచింగ్ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించినప్పటికీ ఎస్సీ సంక్షేమ వసతి గృహాల రెగ్యులర్ వర్కర్లను స్టడీ సర్కిల్ కోచింగ్ కోసం వాడుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో డీఎస్సీడీవోకు అతి సన్నిహితంగా ఉన్న వార్డెన్ మారుతి కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. దుబ్బ ప్రాంతంలో పురుష అభ్యర్థుల కోసం అద్దెకు తీసుకున్న భవనం అద్దె చెక్కు మారుతి పేరు మీదనే డ్రా అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. వార్డెన్‌ల సంఘం అధ్యక్షుడిగా చెలామణి అవుతున్న మారుతి మిగతా వార్డెన్‌లపై డీఎస్సీడీవో అండతో కక్షసాధింపు చర్యలకు పాల్పడినట్లు సమాచారం. మరో వారం పది రోజుల్లో వార్డెన్‌ల సంఘానికి ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో మళ్లీ తిరిగి ఎన్నిక అయ్యేందుకు మారుతి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తనకు అనుకూలంగా లేని వార్డెన్‌లపై దుష్ప్రచారం చేసి తన దారికి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సదరు వార్డెన్‌పై బియ్యం అమ్ముకున్న కేసు ఇంకా కొనసాగుతోంది. ఆ కేసు నుంచి తప్పించుకునేందుకే డీఎస్సీడీవోకు దగ్గరైనట్లు సమాచారం. ప్రస్తుతం డిచ్‌పల్లి హాస్టల్ వార్డెన్‌గా ఉన్న మారుతి అసలు విధులకు వెళ్లడనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్బాల్ అనే కుక్ హాస్టల్ మొత్తం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

విందులు.. వినోదాలు

డీఎస్సీడీవోగా పనిచేసిన శశికళతో మారుతి అనేక విందులు, వినోదాలకు వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది అంబేద్కర్ జయంతి రోజున నగర శివారులోని చిన్నాపూర్‌లోగల ఓ ఫాం హౌజ్‌లో పలువురు వార్డెన్‌లతో కలిసి శశికళకు విందు ఏర్పాటు చేసినట్లు సమాచారం. మరునాడు శశికళ పుట్టినరోజు ఉండటంతో ముందస్తు విందు ఏర్పాటు చేయడంతో పాటు హాస్టల్స్‌లో డబ్బులు వసూలు చేసి డీఎస్సిడివోకి భారీ గిఫ్టులు ఇచ్చినట్లు తెలుస్తోంది. మారుతిపై గతంలో నగరంలోని నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద గల ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్‌తో కలిసి బియ్యం అమ్ముకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా, వార్డెన్‌ల సంఘం అధ్యక్షుడిగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో మొత్తం ఈయనదే హవా కొనసాగేలా చూసుకున్నాడు. రాబోయే వార్డెన్‌ల అధ్యక్ష ఎన్నికల్లో మారుతికి వ్యతిరేకంగా మరో వ్యక్తిని అధ్యక్షుడిగా చేసేందుకు ఈయన వల్ల ఇబ్బంది పడ్డ వార్డెన్‌లు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అది గ్రహించిన మారుతి తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిపై దుష్ప్రచారం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



నాలాలో గల్లంతైన చిన్నారి కథ విషాదాంతం

- విగత జీవిగా అనన్య మృతదేహం లభ్యం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 22: నగరంలోని ఆనంద్‌నగర్‌లో నాలాలో గల్లంతైన చిన్నారి అనన్య కథ విషాదాంతమైంది. బుధవారం సాయంత్రం నగరంలోని ఆనంద్‌నగర్‌లో ఆడుకుంటూ నాళాలో పడిపోయి గల్లంతైన చిన్నారి అనన్య విగత జీవిగా గురువారం ఉదయం ఆమె మృతదేహం నాళాలో లభించింది. బుధవారం సాయంత్రం అనన్య గల్లంతు కాగా డిజాస్టర్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది నాళాలో గాలించినప్పటికీ ఆచూకి లభ్యం కాలేదు. వర్షం కారణంగా కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం చీకటి పడటంతో బుధవారం గాలింపు చర్యలు నిలిపివేశారు. గురువారం గాలింపు చేపట్టగా గల్లంతైన స్థలం నుంచి వంద మీటర్ల దూరంలో అనన్య మృతదేహం లభించింది. దీంతో అనన్య మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. తమతో పాటు గడిపిన చిన్నారి విగతజీవిగా కనిపించడంతో వారి రోదనలు మిన్నంటాయి. స్థానికులను సైతం చిన్నారి మృతి కంటనీరు పెట్టించింది. నాలాల విషయంలో నగర కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం ఓ చిన్నారి ప్రాణాన్ని బలి తీసుకుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న నాలాలను మూసి వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



కాలువలో లభ్యమైన చిన్నారి మృతదేహం

ఘనంగా రాజా బహద్దూర్ వెంకట్రామిరెడ్డి జయంతి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 22: రాజాబహద్దూర్ వెంకట్రాంరెడ్డి 155వ జయంతిని గురువారం నగరంలోని వినాయక్‌నగర్‌లోగల మహనీయుల స్థూపాల వద్ద ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలకు బడుగు బలహీన వర్గాలకు సమాజంలోని అందరికి ఆదర్శంగా నిలిచే విధంగా రెడ్డి హాస్టల్, రెడ్డి కాలేజీలను స్థాపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కవితారెడ్డి, విద్యావేత్త నరేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి భూమారెడ్డి, రాజేందర్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, జి.ప్రభాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకట్రాంరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాలు

దోమకొండ, ఆగస్టు 22 : మండల కేంద్రంలోని శ్రీ ఆముదాలపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 31న ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ప్రత్యేక పూజలు చేస్తామన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

కామారెడ్డిటౌన్,ఆగస్టు 22 : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అర్‌బీనగర్‌కు చెందిన కాకర్లవికాస్‌పై కేసు నమోదుచేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు మాచారెడ్డి మండల చింతల్ గ్రామానికి చెందిన పల్లపు నర్సింలు అనే వ్యక్తిపై 2021 సంవత్సరంలో వికాస్ తల్లి కాకర్లబాలమణిని చంపడనే నెపంతో పాతబస్టాండ్ నుంచి బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని అర్‌బీనగర్‌కు తీసుకుపోయాడు. అక్కడ చేతులను కట్టెసి కట్టెలతో, రాళ్లతో ఇష్టారీతిన దాడిచేయడంతో నర్సింలు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడని తెలిపారు. బాధితుడు నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

'డ్రగ్స్‌ఫ్రీ తెలంగాణ కోసం పోరాటం'

కామారెడ్డిటౌన్, ఆగస్టు 22 : తెలంగాణ నవనిర్మాణ్ విద్యార్థిసేన ఆధ్వర్యంలో డ్రగ్స్‌ఫ్రీ తెలంగాణ కోసం యంగ్ సైరన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు టీఎన్‌వీఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుత సమాజంలో యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటుందన్నారు. అతి ప్రమాదకరమైన వ్యసనం డ్రగ్స్ అని, చాపకింద నీరులా డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలు విస్తరిస్తున్నాయన్నారు. వ్యసనాల నుంచి యువతను దూరం చేసేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

కామారెడ్డిటౌన్, ఆగస్టు 22 : హత్యచేసిన కేసులో నిందితునికి జీవితఖైదు విధించినట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. తాడ్వాయి మండలం సోమారం గ్రామానికి చెందిన పిట్ల గోపాల్,సంపంగి రవిలు మేకలు దొంగిలించాలని అనుకుని 2019 మే 22న సాయంత్రం కామారెడ్డి న్యూబస్టాండ్ నుంచి తుప్రాన్ వరకు వెళ్లారు. తుప్రాన్ వద్ద మద్యం తీసుకుని గజ్వేల్ రూట్‌లో నాచారం గ్రామశివారులో రోడ్డు నుండి కొంచెం దూరంలోకి వెళ్లి అక్కడ మద్యం తాగుతున్న సమయంలో రవికి ఫోన్‌రాగా మాట్లాడుతున్నాడు. గతంలో రవి, మృతుడు గోపాల్ భార్యకు వివాహేతర సంబంధం ఉంది. దీంతో రవి తన భార్యతోనే మాట్లాడుతున్నావంటూ మళ్లీ వివాహేతర సంబంధం పెట్టుకున్నావంటూ రవిని నిలదీశాడు. సంబంధం విషయం తెలిసిందని మనసులో పెట్టుకుని చంపాలని ఉద్దేశంతో మద్యం ఎక్కువగా తాగించి తల, మర్మాంగంపై కట్టెతో కొట్టగా మృతుడు పడిపోయాడు. తర్వాత చనిపోయాడని నిర్ధారించుకుని తర్వాత ఎవరు గుర్తుపట్టకుండా కొద్దిదూరంలో గల రెండు బండరాళ్లమధ్య పడేశాడు. మృతుడి ఇంటికి రాకపోవడంతో మృతుని భార్య తాడ్వాయి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని సాంకేతికత ఆధానంగా దర్యాప్తు చేయగా రవి హత్యచేసినట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. దీంతో అతనిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. అప్పటినుంచి విచారణ కొనసాగగా గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ నిందితుడికి జీవితఖైదు, రూ.10 వేల జరిమానా విధించినట్లు తెలిపా రు. ఈ కేసును చేదించేందుకు పనిచేసిన అప్పటి సీఐ రామాంజనేయులు, ఎస్ఐ అంజయ్య, వెంకట్, ప్రస్తుత సదాశివనగర్ సీఐ సంతోష్, యస్ఐ వెంకటేశ్వర్, పీపీ రాజగోపాల్‌గౌడ్‌లను ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి : మాజీ ఎమ్మెల్యే


ఆర్మూర్‌లో రైతుల ధర్నాలో మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి


వేల్పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


వర్ని కెనరా బ్యాంకు మేనేజర్ నార్యను నిలదీస్తున్న రైతులు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు22: ఎలాంటి ఆంక్షాలు లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని మాజీఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి రైతులను మోసం చేస్తుందన్నారు. తక్షణమే ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని లేదంటే ఉద్యమం చేపడతామని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రతీ రైతుకు రూ.లక్ష రుణమాఫీ జరిగిందని, అప్పుడు లేని సాంకేతిక లోపాలు ఇప్పుడు ఉందకు వచ్చాయని ప్రశ్నించారు. ఒక్కో మంత్రి ఒక్కో మాట మాట్లాడుతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోపు రైతులందరికి రుణమాఫీ చేస్తానని, ప్రతీనియోజకవర్గంలో దేవుళ్లపై ఒట్టు వేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తక్షణమే రైతులకు పంట పెట్టుబడి సహాయం కింద రైతు బంధు ఇచ్చి ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీని చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు గంగామోహన్‌చక్రు, లింబాద్రి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, సొసైటీ చైర్మన్ కాపెల్లి చిన్న ముత్తెన్న, మాజీ సర్పంచ్ గణేష్, సీనియర్ నాయకులు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ముప్కాల్: రైతురుణమాఫీని రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలు ఆంక్షాలు అర్థం లేని షరతులే రైతులకు శాపంగా మారాయని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ షరతులు లేకుండా రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా 24గంటల కరెంటు, సాగునీరు, పంట పెట్టుబడి అందించారని, గెలిచిన మొదట్లోనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని రైతులను మోసం చేశాడని ఆరోపించారు. కాంగ్రెస్ రుణమాఫీ పెద్ద మోసమని, ఎలక్షన్‌లో రూ.40వేల కోట్లు, కేబీకేట్‌లో రూ.31 కోట్లు, బడ్జెట్‌లో రూ.26కోట్లు ప్రకటించి ఇప్పుడు రూ.17వేల900కోట్లు చూపి, రూ.7500కోట్లు మాఫీ చేశారని మండిపడ్డారు.బీఆర్‌ఎస్ మొదటి సారి రూ.లక్ష చొప్పున రూ.35లక్షల మంది రైతులకు రూ.17వేల కోట్లు మాఫీ చేస్తానని వివరించారు.రైతుల ఆందోళనతో మంత్రులు తలలోమాట అంటున్నారని విమర్శించారు.అనంతరం తహసీల్దార్‌కువినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నవీపేట: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీ.మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, శ్రీనివాస్ గౌడ్, వంశీమోహన్, రాము, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: షరత్తులు లేకుండా రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్‌ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో రైతులతో కలిసి ధర్నాలు నిర్వహించారు. నగరంలోని ధర్నాచౌక్ వద్ద నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త మాట్లాడుతూ మాయమాటలతో అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం కుచ్చుటోపి పెట్టిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రాంకిషన్‌రావు, నగర అధ్యక్ష, కార్యదర్శులు సిర్పరాజు, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, రవిచందర్, ప్రభాకర్‌రెడ్డి, ఎనుగందుల మురళి, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: రైతు రుణమాఫీలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫల మైందని మాజీ డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్‌లు ఆరోపించారు. గురువారం బోధన్ పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ర్యాలీగా ఆర్డీవో కార్యాలయంకు వెళ్లి ధర్నా నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు సంజీవ్‌కుమార్, బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గంగారాం,నాయకులు నక్కలింగారెడ్డి,రవిశంకర్‌గౌడ్, సంజీవ్‌పటేల్, గణేష్‌లతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నందిపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలు లేకుండా అర్హులైన ప్రతీ రైతు రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ చేయాలని జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు డిమాండ్ చేశారు. గురువారం నందిపేట మండల కేంద్రంలోని నంది విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడి ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడి మచ్చర్ల సాగర్, నాయకులు ఉల్లి శ్రీనివాస్ గౌడ్, సయ్యద్ హుస్సేన్, కొత్తూర్ భాస్కర్, ఎర్రం ముత్యం, రాజన్న, బొద్దు రాజశేఖర్, బాల గంగాధర్,ప్రవీణ్‌గౌడ్, దేవేందర్, మురళి తదితరులు ఉన్నారు.

నవీపేట: అర్హులైన రైతులందరికి 2లక్షల రూపాయల రుణమాఫీ అమలు చేయాలని కోరుతూ గురువారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైన మిగిలిన రైతులందరికి రుణమాఫీ చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు నర్సింగ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: రైతులందరికి ఏలాంటి ఆంక్షాలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం భీమ్‌గల్ పట్టణంలోని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆర్మూర్ మహేష్, చౌట్‌పల్లి రవి, శర్మనాయక్, శివసారి నర్సయ్య, ఓమాయి రాజేశ్వర్, మోహీస్, మహిపాల్, అబ్దుల్ రజక్, నర్సింహచారి, తదితరులు పాల్గొన్నారు.ఆలూర్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మర్కంటి మల్లేష్, నలిమెల మోహన్‌రెడ్డి, చిన్నారెడ్డి,రమేష్, బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ ఏలాంటి ఆంక్షాలు లేకుండా రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూమేష్, పోగరి సంజీవ్, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ పిలుపు మేరకు రెంజల్‌మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం ముందు బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు కాశం సాయిలు, మౌలానా, గోపాల్ రెడ్డి, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ఏకకాలంలో రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీ చేయాలంటు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ అన్నారు. గురువారం ముప్కాల్ మండల కేంద్రంలో గాంధీచౌరస్తా వద్ద రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన ఇప్పుడు రైతులను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సామ వెంకటరెడ్డి, ఉమా శంకర్, రాజారెడ్డి, శ్రీనివాస్,బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వర్ని: వర్ని మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ఎదుట గురువారం పంట రుణమాఫీ కోసం రైతులు ఆందోళనకు దిగారు. బ్యాంకు అధికారుల తప్పుడు కంప్యూటర్ నమోదు వల్లే పంట రుణాలు మాఫీ కాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మేనేజర్ నార్యాతో వాగ్వాదానికి దిగారు. తాము ఎలాంటి పొరపాటు చేయలేదని రుణమాఫీ కాని రైతుల కోసం వ్యవసాయ శాఖ అధికారికి సంబంధిత రైతు బయోడేటా పంపించి ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులను తిరిగి లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తామని మేనేజర్ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు పెట్టకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని జాతీయరహదారిపై బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం రుణమాఫీ చేయడంలో రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ఆగస్టు 15లోపు రైతులందరికి రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కేవలం 30శాతం మంది రైతులకు రుణమాఫీ చేశారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఎలాంటి నిబంధనలు లేకుండా రుణాలు మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కల్లెడ ఏలియా, మాజీఎంపీపీ శివలింగు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు ఏనుగు రాజేశ్వర్, తీగెల సందీప్, వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దబజార్: ఎటువంటి అంక్షలు లేకుండా రైతులందరికి రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో రైతు డిక్లరేషన్ పేరుతో తెలంగాణ రైతులకు రెండు లక్షల రూపాయల రుణాలను డిసెంబర్ 9న సోనియమ్మ జన్మదినం సందర్భంగా రైతురుణమాఫీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

ఏర్గట్ల: మండలంలోని రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని కోరుతూ మండలంలోని బిఆర్‌ఎస్ నాయకులు గురువారం తహసీల్దార్ శైలజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ నాయకులు బస్టాండ్ వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయాలని ర్యాలీగా వెళ్లి వినతి పత్రం అందజేశారు.ఈకార్యక్రమంలో భారస మండలా ధ్యక్షుడు రాజాపూర్ణానందం, మాజీఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్లు బర్మచిన్న నర్సయ్య, సోమిరెడ్డి శ్రీనివాస్, నాగిరెడ్డి రాజేందర్, దేవన్న యాదవ్, నాగులపల్లి అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎడపల్లి: రైతులందరికి రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అర్హులైన రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని ప్రభుత్వ తీరును ఎండగడుతూ నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ ధన్వాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దేరడి శ్రీరాం, మాజీ ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్ ఎడపల్లి ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, నాయకులు అహ్మద్ ఖాన్,గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రైతు రుణ మాఫీని పూర్తి స్థాయిలో షరతులు లేకుండా అమలు చేయాలని మాజీ జడ్పీటీసీ, బీఆర్‌ఎస్ యువ నాయకుడు బాజిరెడ్డి జగన్మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం డిచ్‌పల్లి తెలంగాణతల్లి విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయాలని నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. రైతు రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా ప్రతి ఒక్కరికి వర్తింప జేయాలని కేసీఆర్ ప్రభుత్వం హయంలో ఏ పథకం నిధుల కోసం ఆగా లేదన్నారు.ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రతినిధులు కొండ కృష్ణ, సాయిలు, పద్మరావు, మోహన్,బీఆర్‌ఎస్‌నాయకులు,కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వేల్పూర్: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా ప్రతీ రైతుకు రూ.2లక్షల లోపు రుణమాఫీ చేయాలని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వేల్పూర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రుణమాఫీపై రైతులు నిర్వహించిన ధర్నా నిరసన కార్యక్రమాలలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జైడి నాగాధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రేగుల్ల రాములు, గంగారెడ్డి, బాల్‌రాజ్, నల్ల రమేష్, డొల్ల రాజేశ్వర్, లింబారెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించే వరకు
డబుల్ రోడ్డు వేయనివ్వం

● ఆర్ అండ్ బీ అధికారుల తీరును నిరసిస్తూ రాస్తారోకో


వర్ని-కోటగిరి రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్థులు

వర్ని,ఆగస్టు22: వర్ని మండల కేంద్రం నుంచి తగిలేపల్లి గ్రామం మీదుగా కోటగిరి మండల కేంద్రం వరకు నిర్మించ తలపెట్టిన ఆర్ అండ్ బీ రహదారి డబుల్ రోడ్డు నిర్మాణ పనులపై తగిలేపల్లి గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఆక్రమించి ఇళ్లను నిర్మించుకున్న వారికి ఆర్ అండ్ బీ అధికారులు వత్తాసు పలుకుతూ మండల కేంద్రంలో దాటాక డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారని ఆందోళనకారులు విమర్శించారు. కోట్లాది రూపాయల ఆస్తులు కలిగి అడ్డదారిలో రోడ్డును ఆక్రమించిన వారి వద్ద అధికారులు లంచాలకు కక్కుర్తి పడి వారు ఆక్రమణలకు వత్తాసు పలుకుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నట్లు ఆరోపించారు. వర్ని, రుద్రూర్, కోటగిరి, పొతంగల్ మండలాలతో పాటు ఆయా మండలాల పరిధిలోని ప్రజలకు, విద్యార్థులకు ఈ రహదారి ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆక్రమణలు తొలగించకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని తగిలేపల్లి, అంబం, రాంపూర్ గ్రామాల ప్రజలు స్పష్టం చేశారు. నిరసనలో గుజ్జ శంకర్, అశోక్, తొంట శంకర్, మైసం వెంకటి, బక్క శంకర్, రాములు, వడ్ల ప్రసాద్, మైసం శ్రీను, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధితో వ్యక్తి మృతి

నందిపేట, ఆగస్టు22: మండలంలోని బైపాస్ రోడ్డులో హోటల్‌కారి రవి (45)అనే వ్యక్తి మూర్ఛవ్యాధితో మృతి చెందినట్లు ఎస్‌ఐ హరిబాబు తెలిపారు.మండలంలోని బజార్‌కొత్తూర్ గ్రామానికి చెందిన హోటల్‌కారి రవిచెప్పులు కుట్టుకొని జీవనం కొనసాగించగా మద్యానికి బానిసై ఈ నెల 19న ఇంటి నుంచి వెళ్లినట్లు పోలీసులు చెప్పారు. గురువారం బైపాస్‌రోడ్డులోని గాండ్లసంతోష్ పొలంలో శవమై కనిపించాడని ,పిట్స్‌తో పొలంలో పడిమృతి చెంది ఉంటాడని పోలీసులు పేర్కొన్నారు. మృతుని అన్న హోటల్‌కారి రాజు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఏ హరిబాబు వివరించారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవు

బోధన్‌రూరల్,ఆగస్టు22: బోధన్, సాలూర మండలాల్లోని గ్రామాల్లో పేకాట ఆడిన నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి అన్నారు. గురువారం హున్స గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని వారి వద్ద నుంచి రూ.1800 స్వాధీనం చేసుకున్నామన్నారు.పేకాట ఆడిజీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేశామన్నారు. ఇక నుంచి గ్రామాలలో పేకాట ఆడిన నిర్వహించిన సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

● ఎంపీడీవో సురేష్ బాబు


మొక్కలను నాటుతున్న ఎంపీడీవో

రుద్రూరు,ఆగస్టు22: పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగ స్వాములు కావాలని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం రుద్రూరు మండల సమీకృత కార్యాలయం ఆవరణలో ఆయన అధికారులతో కలిసి మొక్కలను నాటారు. నాటుదాం ఒక చెట్టు అమ్మపేరు మీద అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలు కురిసేందుకు, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడం కోసం తమ వంతుగా ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఏపీవో మనోహర్, ఏపీఎం భాస్కర్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ సర్వేను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్


జన్నేపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్


వన్నెల్(బి)లో ..

నవీపేట,ఆగస్టు22: మండలంలోని జన్నేపల్లిలో గురువారం ఎల్‌ఆర్‌ఎస్‌కు సర్వేను స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అంకిత్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగాదరఖాస్తులను సమగ్రంగా అధికారులు పరిశీలించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలించడానికి వెళ్లడానికి ఒక రోజు ముందే దరఖాస్తులకు సమాచారం అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాస్,ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, ఇరిగేషన్ ఏఈ ప్రణయ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై దరఖాస్తుల స్వీకరణ

ముప్కాల్: బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామంలో గురువారం ఎల్‌ఆర్‌ఎస్ -2020 దరఖాస్తులను డివిజనల్ పంచాయతీ అధికారి శివకృష్ణ పరిశీలించారు. అనంతరం అమ్మ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. నాటిన ప్రతీ మొక్కను పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న దృష్ట్యా ప్రతీ పంచాయతీలో పారిశుధ్యం కార్యక్రమం నిర్వహించాలని, దోమలు ప్రభలకుండా చర్యలు చేప ట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గంగామోహన్, ఇరిగేషన్ ఏఈ లింబాద్రి, ఎంఆర్‌ఐ భరత్, పంచాయతీ అధికారి రజనీకాంత్, ఫీల్డ్ అసి స్టెంట్ సురేష్, కారోబార్‌భూషణ్ పాల్గొన్నారు.

అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టిన బైక్

● తండ్రి మృతి, కుమారుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన సగ్గు సాయన్న , వాహనం

నవీపేట,ఆగస్టు22: మండలంలోని హనుమాన్ ఫారం సమీపంలో గురువారం బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొనడంతో తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా కుమారుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ వినయ్ తెలిపిన ప్రకారం నిర్మల్ జిల్లా కిర్గుల్(కే)కు చెందిన సగ్గు సాయన్న(74)తో పాటు అతని కుమారుడు సుభాష్‌లు కలిసి బైక్‌పై మాక్లూర్ మండలం గుంజిలిలో ఉన్న ఓ గృహ ప్రవేశానికి హాజరయ్యారు. అనంతరం తిరిగి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా మండలంలోని హనుమాన్ ఫారం సమీపంలో బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో సగ్గు సాయన్న అక్కడికక్కడే మృతి చెందగా అతని కుమారుడు సుభాష్ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు సుభాష్ కుమారుడు సాయికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీవో నెంబర్ 28ని రద్దు చేయాలి

బోధన్‌రూరల్,ఆగస్టు22: బోధన్ పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో పీఆర్‌టీయూ డివిజన్ అధ్యక్షులు ఎంబెల్లి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 2018ఆగస్టు 23న జీవో నెంబర్ 28ని అమలు చేస్తూ సీపీఎస్ విధానాన్ని ఉద్యోగులకు అమలులోకి తీసుకువచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాలు గడిచినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం సీపీఎస్ విధానికి అనుకూలంగా జీవో నెంబర్ 28ని అమలులోకి తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీరని ఆశానిపాతానికి గురి చేసిందన్నారు. కావున జీవో నెంబర్ 28ని రద్దు చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానంలోనే తీసుకువెళ్లాలన్నారు. ఆగస్టు 23 సీపీఎస్ వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటామని జీవోను వ్యతిరేకిస్తూ కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్, అర్బన్ మండల అధ్యక్షులు ఖైరన్, గంగాధర్, వీరేష్ బాబు, నిజాముద్దీన్, శంకర్, ప్రాథమిక సభ్యులు, సీపీఎస్ బాధితులు తదితరులున్నారు.

కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక గుండెపోటుతో తండ్రి మృతి


వెంటేష్,సాయికుమార్(ఫైల్)

బోధన్‌రూరల్,ఆగస్టు22: బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామానికి చెందిన యువకుడు సాయికుమార్ మూడు రోజుల కిందట కందకుర్తి గోదావరి నదిలో ఈత కోసం అని వెళ్లి మృతి చెందడం జరిగింది. కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక తండ్రి దేవర్ల వెంకటేష్(54) పదే పదే కొడుకును గుర్తు చేసుకుంటూ ఉండేవాడని గ్రామస్థులు తెలిపారు. గురువారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక తండ్రి గుండెపోటుతో మరణించడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

బాధితులకు న్యాయం చేయాలి


కలెక్టరేట్‌కు వచ్చిన నాగారం బాధితులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 22:నగరంలోని నాగారంలోగల భారతీరాణి కాలనీలో చెరువు భూమిలో ఇండ్లను నిర్మించారని మున్సిపల్ అధికారులు ఆ ఇండ్లను కూల్చివేయడం వల్ల చాలా మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారని వారికి ఎలా ంటి రక్షణ లేకపోవడంతో ఎక్కడ ఉండలేని పరిస్థితి ఉందని కావున వారికి న్యాయం చేయాలని ఎంఐఎం నాయకులు గురువారం కలెక్టరేట్‌కు వచ్చారు. ఎలాంటి నోటీసులు, సమాచారం లేకుండా అక్రమ నిర్మాణాల పేరుతో కూల్చివేయడం సరికాదని ఇతర స్థలాలలో వెంటనే డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిరుపేదలకు ఇవ్వాలని కోరారు. సర్వే నెంబర్ 249 డివిజన్ నంబర్ 13లో ఉన్న రెవెన్యూ భూమిని పేదలకు కేటాయించాలని కోరారు. కలెక్టరేట్‌కు వచ్చిన వారిలో ఎంఐఎం నాయకులు, డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, షకీల్ ఫైమద్, ఫాజిల్, మునావర్ అలీ, షహబాస్, రియాజ్, తదితరులు ఉన్నారు.

నరికి వేతకు గురైన అటవీ పరిశీలన


నరికి వేతకు గురైన అటవీని పరిశీలిస్తున్న సీఐ బిక్షపతి

సిరికొండ ఆగస్టు 22 : సిరికొండ సమీపాన గల 408 కంపార్టుమెంట్‌లో నరికివేతకు గురైన అటవీని ధర్పల్లి సీఐ బిక్షపతి గురువారం సందర్శించారు. బొడ్డుమామిడి చెరువు సమీపాన సిరికొండకు చెందిన కొందరు గిరిజన యువకులు విచ్చల విడిగా అడవీని నరికి వేసిన తెలుసుకున్న సీఐ బిక్షపతి, ఎస్ఎల్.రామ్ తమ సిబ్బందితో కలిసి నరికి వేతకు గురైన అడవీని దగ్గరుండి గమనించారు. ఎన్ని ఎకరాల వరకు నరికి వేశారో ఫారెస్టు డిప్యూటి రేంజ్ అధికారి గంగారాంను అడిగి తెలుసుకున్నారు. తండాకు చేరుకుని గిరిజనులతో సీఐ మాట్లాడారు. తండాలో తీజ్ పండగాను జరుపుకుంటున్నామని శుక్రవారంపోలీస్ స్టేషన్‌కు వస్తామని గిరిజనులు చెప్పడంతో సీఐ ,ఎస్సై అటవీశాఖ అధికారులు తిరిగి వచ్చారు. లొంక తండాకు సమీపాన నరికివేతకు గురైన అటవీభూమిని కూడ సీఐ,ఎస్సై పరిశీలించారు.వారి వెంట డిప్యూటీ రేంజ్ అధికారి గంగారాం, బీట్ అధికారి శశాంక్ తదితరులు ఉన్నారు.

● సిరికొండ తండాకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు

డిప్యూటీ రేంజ్ అధికారి గంగారాం మాట్లాడుతూ సిరికొండ తండాకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వీరే కాకుండా ఇంక కొందరిపై కేసు నమోదు అవుతుందన్నారు. హుస్సేన్‌నగర్‌కు చెందిన ఎనిమిది మందిపై రెండు కేసుల చొప్పున నమోదు చేసినట్లు గంగారాం తెలిపారు.

హైదరాబాద్ తరలి వెళ్లిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యకర్తలు

సిరికొండ ఆగస్టు 22: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలని కోరుతూ హైదరాబాద్‌లోజరిగే ధర్నా కార్యక్రమానికి సిరికొండ మండలానికి చెందిన సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ కార్యకర్తలువాహనల్లో తరలివెళ్లారు. సుందరయ్య విజ్ఞాన పార్కు నుంచి ఇందిరాపార్కు వరకు జరిగే ర్యాలీకి కార్యకర్తలు తరలివెళ్లినట్లు ఆపార్టీ ఆర్మూర్ డివజన్ సహాయ కార్యదర్శి రమేష్ తెలిపారు.

రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నవీపేట,ఆగస్టు22: మండలంలోని సిరన్‌పల్లిలో గురువారం రుణమాఫీ వర్తించని రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, ఏవో నవీన్‌కుమార్, ఏఈవో రాజహంస, తదితరులున్నారు.

నాడాపూర్‌లో దొంగతనం

నవీపేట,ఆగస్టు22: మండలంలోని నాడాపూర్‌లో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. ఎస్‌ఐ వినయ్ తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన వినోకర్, సరలత దంపతులు రాత్రి భోజనం చేసిన అనంతరం తమ కింది ఇంటికి తాళం వేసి పైన ఉన్న ఇంట్లో నిద్రించారు. గురువారం ఉదయం కింది ఇంటిని పరిశీలించగా తాళం పగులగొట్టి ఉంది. గుర్తు తెలియని దొంగలు తాళాన్ని పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. లోపల ఉన్న బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న రెండు తులాల బంగారం, 16తులాల వెండితో పాటు 1.30లక్షల రూపాయల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. సంఘటనకు సంబంధించి బాధితురాలు సరలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాలలో అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల తనిఖీలు

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు22:జిల్లాలోని బీసీ,ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వ హించాలని యునైటెడ్ భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సిద్దాల నాగరాజు, కార్యదర్శి పెద్ది సూరిలు అన్నారు. గురువారం పట్టణంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ, బీసీ గురుకులాలు రెసిడెన్షియల్ కాలేజీ దాదాపు 50కి పైగా ఉన్నాయని, మౌళిక సదుపాయాలు కరువై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుపడుతు న్నారని అన్నారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై స్పెషల్ డ్రైవ్

ముప్కాల్, ఆగస్టు22: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ రైతు కుటుంబానికి రూ.2లక్షల చొప్పున రుణమాఫీ ప్రతిష్టాత్మకంగా తీసుకొని మూడు దఫాల్లో రూ.2లక్షల రుణ మాఫీ పంట రుణాలు కలిగి ఉన్న కుటుంబాలకు చేయడం జరిగిందని మండల వ్యవసాయాధికారి లావణ్య తెలిపారు. గురువారం బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖల ఆధ్వ ర్యంలో రైతురుణమాఫీకి సంబంధించిన స్పెసల్‌డ్రైవ్ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎస్సై, బి. నరేష్ వ్యవసాయాధికారిణి రేష్మ, రైతులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని టావెరా బోల్తా

● యువకుడి మృతి.. పలువురికి గాయాలు


సల్మాన్(ఫైల్)

నవీపేట,ఆగస్టు22: మండలంలోని అబ్బాపూర్(ఎం) పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం రాత్రి టావెరా వాహనం డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన ఘటనలో అందులో ప్రయాణిస్తున్న యువకుడు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం నిర్మల్ జిల్లా భైంసా నుండి పలువురు యువకులు బోధన్‌లోని జలాల్ బుకారి దర్గాలో జరుగుతున్న ఉర్సు ఉత్సవాలలో పాల్గొనడానికి టావెరావాహనంలో బయలుదేరారు.టావెరావాహనం అబ్బాపూర్ (ఎం)సమీపంలో అదుపు తప్పిడివైడర్‌ను ఢీకొని బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న సల్మాన్(25) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి.గాయపడిన వారికి చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చూడాలి



పాలెం పాఠశాలలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

మోర్తాడ్, ఆగస్టు22: మండలంలోని పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈవో దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. గురువారం అమ్మ అదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల తరగతి గదుల పరిశీలన, తరగతి గదుల్లోని సౌకర్యాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మినరల్ వాటర్ గురించి విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. అనంతరం డీఈవో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి చదువుల, రాయుట గురించి శ్రద్ధ వహించాలని అన్నా రు. ఇంటింటికి వెళ్లి విద్యార్థులు వచ్చేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.నర్సింహస్వామి,చంద్రశేఖర్, రాజేందర్, జ యశ్రీ, త్రివేణి, రాజేశ్వరి, గంగాధర్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

● ఏర్గట్ల కేజీబీవీ పాఠశాల పరిశీలించిన డీఈవో దుర్గాప్రసాద్

ఏర్గట్ల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాల యంలను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ పరిశీలించారు. అందులో భాగంగా పాఠశాలలోని వసతులు, వంట గది, తరగతి గదులు, పాఠ శాల పరిసరాలు,అనంతరం రికార్డులను పరిశీలించారు. పాఠశాలకు విద్యుత్ సౌకర్యం సరిగా లేదని ఎస్‌వో సంధ్య డీఈవోకు తెలపగా సమస్య పరిష్కరి స్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి,ఆగస్టు 22: నవంబరు 1నుంచి డిచ్‌పల్లి ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పురుషులకు 13రోజుల పాటు సీసీటీవీ ఇన్స్‌స్టలేషన్, 30రోజుల పాటు సెల్‌ఫోన్ శిక్షణ, 30రోజుల పాటు ఏసీ రిపేర్ ఉచిత శిక్షణలు ప్రారంభమవుతాయని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, తెలి పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు నిజామాబాద్-కామారెడ్డి జిల్లాలకు చెందిన వారు అయి ఉండి 19-45 ఏళ్ల లోపు ఉండి గ్రామీణ ప్రాంత యువకులు ఆధా ర్, రేషన్‌కార్డు, పదోతరగతి మెమో జిరాక్స్ 5ఫోటోలతో తమ కార్యాలయం (టీటీడీసీ పక్కన) సంప్రదించాలని కోరారు. శిక్షణలో అభ్యర్థులకు పూర్తిగా ఉచిత భోజనం, హాస్టల్,టూల్‌కిట్స్ అందజేయడం జరుగుతుందని, తెలిపారు. పూర్తి వివరాలకు 08461-295428 నంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

రావుట్ల సెక్షన్ అధికారి సస్పెన్షన్

సిరికొండ ఆగస్టు 22: సిరికొండ రేంజ్ పరిధిలోని రావుట్ల సెక్షన్ అధికారి వసంత్‌రావును జిల్లా అటవీ శాఖ అధికారి సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులుజారీ చేసినట్లు సమాచారం. జంగిలోడి తండాలో అడవీ భూమిని ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్న విషయంలో వసంత్‌రావు ఉదాసీన వైఖరి కారణమని అంటున్నారు. ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవడానికి వెళ్లిన అటవీ, పోలీస్ సిబ్బందిపై గిరిజనులు తిరుగబడ్డ విషయాన్ని ఉన్నాతాధికారులుసీరియస్ గా తీసుకున్నారని సమాచారం.వసంత్‌రావు సస్పెన్షన్ చేయడంతో పాటు నరేందర్ బేస్‌క్యాంపు సిబ్బంది ఉద్యోగంలో నుంచి టర్మినేట్ చేసినట్లు అటవీ శాఖ సిబ్బంది చెప్పారు.

కొనసాగుతున్న జూడాల నిరసనలు

పెద్దబజార్, ఆగస్టు 22: తెలంగాణలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులలో డ్యూటీ డాక్టర్లకు సరైన డ్యూటీ రూమ్‌లు, వాష్‌రూమ్‌లను అందించాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట ఓపీ సేవలు, ఎంపిక చేసిన వార్డులు, శస్త్రచికిత్సలను బహిష్కరిస్తూ 8వ రోజు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా జూడాలు మాట్లాడుతూ ఆర్జికర్ మెడికల్ కళాశాల బాధిత మహిళలకు న్యాయం జరగాలన్నారు.సీబీఐ విచారణ,సుప్రీంకోర్టు నుంచిఫాస్ట్‌ట్రాక్ న్యాయం జరగాలని కేంద్ర రక్షణ చట్టం యొక్క అత్యవసర అమలు చేయాలని ఆసుపత్రిలలో అవసరమైన ప్రాంతాల్లో సీసీటీవి ఏర్పాటు చేయాల న్నారు. తెలంగాణలోని అన్నిప్రభుత్వ ఆసుపత్రులలో మ హిళల ఆరోగ్య సంరక్షణ కార్యకర్తల కోసం మహిళ భద్రత విభాగాన్ని సృష్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో జూడా జిల్లా అధ్యక్షుడు జితిన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యమే మౌమితపై దాడికి కారణం

ధర్పల్లి, ఆగస్టు 22:ప్రభుత్వ వైఫల్యమే మౌమితపై దాడికి కారణమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు అనిల్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కత్తాలో జరిగిన మౌమితపై అత్యాచారాన్ని వ్యతిరేకిస్తూ తీవ్రంగా ఖండించారు. మండల కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వం వారి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. ఇప్పటివరకు నేరస్తుడికి శిక్ష పడకపోవడం వారి వెనుక ఏకోణం దాగిఉందో అనుమానాలకు దారి తీస్తున్నాయని అన్నారు. పశ్చిమబెంగాళ్ ముఖ్యమంత్రి సైతం నిరసన ర్యాలీలో పాల్గొనడం ఆశ్చర్యానికి దారి తీస్తుందని పేర్కొన్నారు. అత్యాచార ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆశీష్, ప్రణీత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరకాస్తులను పరిశీలించాలి




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

సుభాష్‌నగర్, ఆగస్టు 22: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై టౌన్‌ప్లానింగ్ అధికారులతో నగరపాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ సమీక్ష నిర్వహించారు. నగరంలోని కమిషనర్ కార్యాలయంలో గురువారం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరకాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ విభాగంపై అనేక ఆరోపణల నేపథ్యంలో అధికారులు తమపనిని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.ఆరోపణలకు తావివ్వకుండా విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ శ్యామ్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ అధికారులు సత్యనారాయణ, అనుప, తదితరులు పాల్గొన్నారు.

● రాజకీయ పార్టీ ప్రతినిధులతో కమిషనర్ సమీక్ష

సుభాష్‌నగర్: ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి రాజకీయ పార్టీ ప్రతినిధులతో నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ సమీక్ష నిర్వహించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025లో భాగంగా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బూత్‌లెవల్ ఆఫీసర్లు ఇంటింటా సర్వే ప్రారంభించామన్నారు. 18సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లు ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. గృహాలు మారిన వారి వివరాలు, మరణించిన వారి వివరాలు బూత్‌లెవల్ ఆఫీసర్లకు అందజేయాలని రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు.ఈ సమావేశంలో ఉత్తర మండల తహసీల్దార్ నాగార్జున, తదితరులు హాజరయ్యారు.

● బాలిక మృతికి మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యత వహించాలి



కాలువను పరిశీలిస్తున్న దృశ్యం

బాలికఅనన్య మృతికి నగర పాలక సంస్థ బాధ్యత వహించాలని ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్ష, కార్యదర్శులు అనిల్, ప్రవీణ్‌లు అన్నారు. నగరంలోని ఆనంద్‌నగర్ లోని అనన్యమృతి చెందిన స్థలాన్ని గురువారం పరిశీలించారు. ఈ సంఘటన మున్సిపల్ సేవలోలోని లోపం, వినియోగదారుల రక్షణ చట్టం 2019లోకి వస్తుంది. కావున అన న్య కుటుంబ సభ్యుల మానసిక వేదనకు పరిహారంగా నగర పాలక సంస్థ 50 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చెల్లించని యెడల బాధిత కుటుంబ సభ్యుల తరపున వినియోగదారుల కమిషన్ కోర్టుకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.ఎన్.వర్మ, గైని రత్నాకర్, శ్రీనివాస్, రవికుమార్‌లు తెలిపారు.

రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

● రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
● రైతులు అధైర్య పడొద్దు.. అర్హులైన వారందరికీ రుణ మాఫీ వర్తిస్తుంది
● గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ పేరిట రైతులను మోసం చేసింది : బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్,ఆగస్టు 22:రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని రైతులు అధైర్య పడొద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ వర్తిస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం బోధన్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈసందర్భంగా బోధన్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా అంకు సంధ్య దామోదర్‌రెడ్డితో పాటు వైస్ ఛైర్మన్ చీల శంకర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, గత ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ అంటూ రైతులను కల్లబొల్లి మాటలతో ఐదు సంవత్సరాల పాటు కాలయాపన చేసిందని, అందుకే రైతులు గత ప్రభుత్వానికి బుద్ధి చెప్పారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు రుణమాఫీ సైతం చేసి చూపిస్తుందన్నారు. కుటుంబ పోషణ కోసం వేరే దేశాలకు వెళ్లిన వారిరుణాలు కూడా మాఫీ చేయడం జరుగుతుందని, దీనికి ప్రణాళికను రూపొందిస్తున్నా మన్నారు.పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్క రైతుకు వర్తిస్తుంద న్నారు.తెల్లరేషన్ కార్డులేని వారికి కూడా రుణమాఫీ వర్తిస్తుంద న్నారు.గతంలో కంటే బోధన్‌ను మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తయారు చేస్తామన్నారు.గతప్రభుత్వం లక్షరూపాయల రుణమాఫీ అంటూ రైతులను మోసం చేసింద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ లను అమలు చేస్తూ రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తుంద న్నారు. దీన్ని ఓర్వలేక కొంత మంది అసత్య ఆరోపణలు చేస్తు న్నారని, వీటిని రైతులు నమ్మవద్దన్నారు.ఒకే కుటుంబంలో భార్యభర్తలు రుణా లు తీసుకున్న వాటికి ఒక ప్రణాళిక ప్రకారం రుణాలు మాఫీ చేయడం జరుగుతుంద న్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తామన్నారు. రెండు సంవత్సరాలకోసారి పంట మార్పిడి చేస్తే దిగుబడి ఎక్కువగా వస్తుంద న్నారు. రైతులు చెరకు పంట వేయడానికి ముందుకు రావాలన్నారు. రైతులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రైతు పంటపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులు చెరకు పంట ఎక్కువగా వేయాలన్నారు. బోధన్, మెదక్, మెట్‌పల్లి, జహీరాబాద్‌లలో చెరకు పంట దిగుబడి అధికంగా వస్తుందని, ఇక్కడి రైతులకు బీజేపీ ప్రభుత్వం విత్తనాలు ఉచితంగా అందించాలన్నారు. రుద్రూరు శాస్త్ర వేత్తలు రైతులకు చెరకు పంటపై అవగాహన కల్పిం చాలన్నారు.ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ ఛైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్, ఏసీపీ శ్రీనివాస్,టీపీసీసీ డెలిగేట్‌గంగాశంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మందర్న రవి, వై.నరేందర్‌రెడ్డి, ఆదినారాయణ, పాషా మొహీనుద్దీన్, హరికాంత్ చారి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బీన్‌హందాన్,రజిత,కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

బోధన్ పట్టణలోని మారుతి మందరంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మారుతి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయం


బోధన్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ కింద నిధులుమంజూరు చేయించి చెక్కులను అందజేశారు.

● మహిళల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

ఎడపల్లి:మహిళా సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని గురువారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు తమ వృత్తి పనులు చేసుకోవడానికి, సమావేశం కావడానికి అవసరమయిన మహిళా సంఘం భవనం నిర్మించి దానిని ప్రారంభించడం జరిగిందన్నారు. మహిళా సంఘం భవనంలో కావలసిన మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మహిళా సంఘాల ద్వారా మహిళలు వడ్డీలేని రుణాలను తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మనం పండించిన పంటలను దళారులకు అమ్మితే అవే మన అవసరాలకు అధిక ధరలకు కొనాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, అలా కాకుండా మహిళా సంఘాల ద్వారా మహిళలు స్వతహాగా కూరగాయలు, పప్పు దినుసుల పండించి వాటిని నేరుగా అమ్మి లాభపడాలని ఆయన సూచించారు. దుస్తులను రెడీమేడ్ షాపులో అధిక ధరలకు కొనకుండా మహిళలే బట్టలు కుట్టి అమ్మాలని దానికి కావలసిన కుట్టు మిషన్‌లను అందిస్తామన్నారు. ప్రభుత్వ అధికారులచే మహిళలు అభివృద్ధి చెందడానికి ప్రణాళిక తయారు చేస్తామన్నారు.అనంతరం ఐకేపి భవన అవరణలో ఎమ్మెల్యే మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మానాల మోహన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్, బిల్లా రాంమోహాన్, ఎడపల్లి, జైతాపూర్ సహకారం సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, సత్యనారాయణ, జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ రజితా ఎల్లయ్య యాదవ్ దంపతులు, ఎడపల్లి మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, నాయకులు బంజ కామప్ప, బొబ్బిలి శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, కంచరి శ్రీనివాస్, ఐకేపి ఏపీఎం ఐకేపి సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు, మహిళలు తదితరులు ఉన్నారు.

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలి

● జలాల్‌బుకారి దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు



బోధన్ జలాల్‌బుకారి దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే

బోధన్ రూరల్, ఆగస్టు 22 : తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరూ ఆయురారోగ్యాల తో సుఖ శాంతులతో ఉండాలని గురువారం బోధన్ పట్టణంలోన ప్రసిద్ధి చెందిన జలాల్‌బుకారి దర్గాలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.జలాల్‌బుకారి ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గాను సందర్శించారు. దర్గా ప్రత్యేక విశిష్ఠతను తెలుసుకున్నారు. జలాల్ బుకారి దర్గాచాలా పవిత్రమైందని ఇక్కడ కోరిక కోర్కెలు నెరవేరుతాయని పరిసర ప్రాంతాల నుండే కాక మహారాష్ట్ర, కర్నాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉర్సు ఉత్స కమిటీని ఈ సందర్భగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్ బీన్ మందాన్, పాషా మొహీనుద్దీన్, శరత్‌రెడ్డి, షరీఫుద్దీన్, ఉర్సు ఉత్సవ కమిటీ సభ్యులు, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుపై ప్రతీ ఒక్కరు మొక్కలు నాటుదాం



ఇందల్వాయిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో అనంత్‌రావు

ఇందల్వాయి,ఆగస్టు 22: వనమహోత్సవంలో భాగంగా ఇందల్వాయి మండలంలోని ఇందల్వాయి గ్రామంలో ఎంపీడీవో అనంత్‌రావు గురువారం రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఇందల్వాయి లక్ష్మీనర్సింహస్వామి మందిరం నుంచి రామాలయం వరకు ఉపాధి హామీ కూలీలతో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించారు. మొక్కలు నాటుదాం అమ్మపేరు పైన అనే కార్యక్రమాన్ని మండలంలోని అన్నిగ్రామాల్లో చేపట్టామని ఆయా గ్రా మాల్లో మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో మొక్కలు నాటినట్లు తెలిపారు. చంద్రయాన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో తహసీల్దార్ వెంకట్రావు మొక్కలు నాటించారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఆయన ప్రజలకు సూచించారు. పచ్చదనం పరిశుభ్రత పాటించి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపారు. ఉపాధి హామీ క్షేత్రసహాయకులు మొక్కలు నాటడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పోశెట్టి, టెక్నికల్ అసిస్టెంట్ మోతి రాం, సుప్రజ, పంచాయతీ కార్యదర్శి భరత్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ధర్పల్లి, ఆగస్టు 22: మండల కేంద్రంలో బుధవారం బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఈనెల 21న రాత్రి గన్నారం నుంచి తల్లీకూతురు సిరికొండకు బంధువుల ఇంటికి బయలుదేరారు. ఇందల్వాయి నుంచి ఆటోలో సిరికొండకు వెళ్తుండగా మార్గమధ్యంలో ధర్పల్లిలో తల్లీ కూతురు ఇంట్లోకి వస్తువులు కొనేందుకు దిగారు. ఐస్‌క్రీమ్ తీసుకుంటానని చెప్పి వెళ్లిన కూతురు తిరిగి రాకపోవడంతో బంధువుల ఇండ్లతో పాటు చుట్టుపక్కల వెతికినా సమాచారం లేకపోవడంతో తల్లిగంగామణి ధర్పలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పాలెంకు చెందిన జగరంపల్లి జైరాజ్ అదృశ్యం

మోర్తాడ్, ఆగస్టు22: మండలంలోని పాలెం గ్రామానికి చెందిన జగరంపల్లి జై రాజ్ అనే యువకుడు అదృశ్యమయ్యాడని ఎస్సై విక్రం తెలిపారు. పాలెం గ్రా మానికి జగరంపల్లి వెంకన్న తన కొడుకు జైరాజ్ ఈనెల 10న ఉదయం నిజా మాబాద్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్ళి ఇంత వరకు రాలేదని ఆయన ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను అరికడదాం

● జిల్లా ఆరోగ్య విద్యాబోధకులు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు

పెద్దబజార్, ఆగస్టు 22: పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను అరికడదామని జిల్లా ఆరోగ్య విద్యాబోధకులు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నగరంలోని అర్సపల్లిలోగల పట్టణ ఆరోగ్య కేంద్రంలో కేర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యంలో భాగంగా వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ ఆరోగ్యం, సామాజిక ఆరోగ్యం, ఆధ్యాత్మిక ఆరోగ్యం ప్రధానమైనవని అన్నారు. అదేవిధంగా సీజనల్ వ్యాధుల్లో ప్రధానంగా వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై దృష్టిసారించాలన్నారు. కీటక, జనిత వ్యాధులను నియంత్రణలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా ముఖ్యమైనవని అన్నారు. దోమల నియంత్రణకు ఇంటి పరిసరాలలో నీటి నిల్వలను తొలగించాలని డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగు, ప్లాస్టిక్, చెత్తా చెదారాన్ని తొలగించాలన్నారు. ఇంటి పరిసరాలలో వాడి పారేసిన గ్లాసులు, కప్పులు, సీసలు, బకెట్లు, పగిలిన కుండలు, పాత టైర్లు మొదలగు వాటిలో నీరు నిలువకుండా వాటిని తొలగించాలన్నారు. ఇండ్లలో వాడేటువంటి కూలర్లు, నీటితొట్టిలు, సంప్‌లు ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుభ్రపరిచి ఎండబెట్టి మరుసటి రోజు నీటిని పట్టుకోవాలని అన్నారు. లేనిచో డెంగ్యూ దోమలు అందులో పెరిగి ఇండ్లలో నివసించే వారికి కుట్టడంతో డెంగ్యూ వ్యాధి వ్యాపిస్తుందని అన్నారు. మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, బోధకాలు ప్రబలకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రతీ ఆదివారం ఉదయం 10గంటలకు పది నిమిషాల పాటు ప్రతి ఇంటి వద్ద నీటినిల్వలను తొలిగిస్తే పరిసరాలు పరిశుభ్రత పాటించినప్పుడు దోమల నియంత్రణ జరుగుతుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలందరూ వైద్య సిబ్బందికి, ఆశలు, ఏఎన్‌ఎంలకు సహకరిస్తే సీజన్‌లో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణతో పాటు పట్టణ ఆరోగ్య కేంద్రం ఏఎన్‌ఎం సునీత, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

ధర్పల్లి, ఆగస్టు 22: మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోగల వసతిగృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో సౌకర్యాలు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించారు. విద్యార్థులు మౌలిక సదుపాయాలను వివరించారు. భోజనం విషయంలో రాజీ పడవద్దని మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ఈవో సైఫొద్దీన్ ఉన్నారు.

నూతన ఎస్సై విక్రంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్, ఆగస్టు22: మోర్తాడ్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై విక్రంను గురువారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్ర మంలో యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బద్దం రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగంలో బదిలీలు

సుభాష్‌నగర్,ఆగస్టు 22: నగర పాలక సంస్థ పారిశుధ్య మరియు ఆరోగ్య రెవెన్యూ విభాగాలలో భారీగా బదిలీలు అయ్యాయి. నగర పాలక సంస్థ కమీషనర్ మంద మకరంద్ గురువారం బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. ఇంటి నెంబర్ల కేటాయింపులో కీలక విభాగమైన రెవెన్యూ విభాగంలో కొంత మంది బిల్ కలెక్టర్లను వారి సొంత విభాగానికి పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ విభాగం నుంచి పబ్లిక్ హెల్త్ వర్కర్స్ విభాగానికి బదిలీలు చేశారు. బదిలీ చేసిన వారిలో మల్లేష్, లక్ష్మణ్, సాయిరాం, విశ్వప్రకాశ్, నరేష్, రాజేందర్, శంకర్‌లు ఉన్నారు. వీరి స్థానంలో రెగ్యూలర్ ఉద్యోగులను బిల్ కలెక్టర్లుగా నియమించారు. బిల్ కలెక్టర్లుగా నియమించిన వారిలో లింబాద్రి, గంగాధర్, అశోక్, ప్రేమ్, గంగాధర్, రఫీక్, సాయన్న, శ్రీకాంత్, మహేష్, మధుసూదన్, ఎస్.గంగాధర్, సుమన్, రాజారాం, దత్తు, నరేందర్, ప్రమీలలు ఉన్నారు. అంతేకాకుండా ఇటీవల బదిలీపై వచ్చిన సలీమ్ ఉద్దీన్, మోహినొద్దీన్, రవికుమార్‌లను బిల్ కలెక్టర్లుగా నియమించారు. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లుగా శ్రీనివాస్, సుభాష్, గంగమల్లు, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బిల్ కలెక్టర్ విధుల నుంచి విరమించిన బిల్ కలెక్టర్లతో ట్రేడ్ లైసెన్సులు, ఆస్తిపన్నుల విభాగంలో సర్వేకు కేటాయిస్తూ కమీషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఆరోపణలు ఎక్కువగా వస్తున్న రెవెన్యూ విభాగంలో బదిలీలు, రెవెన్యూ సంపూర్ణ ప్రక్షాళనపై కమీషనర్ దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తుంది.

మద్యం తాగి నడిపిన ముగ్గురికి రెండు రోజుల జైలు

ఖిల్లా, ఆగస్టు 22: మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందికి కౌన్సిలింగ్ నిర్వహించి కోర్టులో హాజరుపర్చగా 12 మందికి రూ.31,500 జరిమానా, ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. నిజామాబాద్ నగరానికి చెందిన అల్లంకి అభిలాష్, ముప్పల అమ్మారావు, నవీపేట్‌కు చెందిన ఎర్ర శేషగిరికి రెండు రోజుల పాటు జైలుశిక్ష విధించినట్లు తెలిపారు. మిగతా 12 మందికి కౌన్సిలింగ్ నిర్వహించి జరిమానా విధించినట్లు తెలిపారు.

'కల్లు డిపో-3పై అసత్య ఆరోపణలు మానుకోవాలి'

సుభాష్‌నగర్, ఆగస్టు 22: నగరంలోని కల్లు డిపో-3పై బయటి వ్యక్తులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని భవాని గీత కార్మిక సంఘం అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ అన్నారు. నగరంలోని డిపో-3 కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భవాని గీత కార్మిక సంఘం కోసం 14 సంవత్సరాలు పోరాడి కష్టపడి సాధించుకున్నామని అన్నారు. బయటి వ్యక్తులు ఉన్నారని ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. పట్టణంలో 20, 30 సంవత్సరాలుగా ఇక్కడే ఉండి జీవనం సాగిస్తున్నామని తెలిపారు. 20, 30 సంవత్సరాలు ఉన్న వారిని స్థానికులు కాకపోతే ఏమవుతారని ప్రశ్నించారు. మాసంఘంలో ఎలాంటి వివాదాలు లేవని బయటి వ్యక్తులు వచ్చి మాసొసైటీలో గొడవలు పెట్టి డిపో-3ని మూసివేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. డిపో-3ని మూసివేస్తే వందలాది కుటుంబాలు రో డ్డున పడతాయని అన్నారు. సభ్యులను పక్కదోవపట్టించి అధికారులపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని అన్నారు. బయటి వ్యక్తులు స్వలాభం కోసం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. నగరంలో డిపో-3కి 13 కల్లు దుకాణాలు ఉన్నాయని అన్నారు. 60 మంది టాపర్లు దీనిపై ఆధారపడి ఉన్నారని అన్నారు. మెంబర్లకు నెలకు వెయ్యి రూపాయల చొప్పున, డైరెక్టర్లకు ఐదువేల చొప్పున ఇస్తున్నామని బయటి వ్యక్తులు ఎలాంటి ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సాగౌడ్, బీఎల్‌ఎన్ గౌడ్, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్‌ను అప్పగించిన ఏఎస్సై



బాధితురాలికి ఫోన్‌ను అందజేస్తున్న దృశ్యం

ఖిల్లా, ఆగస్టు 22:పోగొట్టుకున్న ఫోన్‌ను ఏఎస్సై కోటేశ్వర్‌రావు బాధితురాలు హరితకు అందజేశారు.నగరంలోని ఆర్డీవో ఆఫీస్‌లో పనిచేస్తున్న హరిసింగ్ గురువారం ఎన్టీఆర్ చౌరస్తా ప్రాంతంలో అనారోగ్యంతో కుప్పకూలిపోగా పక్కనే ఉన్న వ్యక్తి సహాయం చేసి కోలుకునేంత వరకు అక్కడే ఉన్నాడు.అనంతరం హరిసింగ్ ఫోన్ చూసుకోగా ఫోన్ లేకపోవడంతో పక్కనే ఉన్న ఏఎస్సై కోటేశ్వర్‌రావును కలిశాడు. దీంతో ఏఎ స్సై కోటేశ్వర్‌రావు విచారణ జరిపి అర్సాపల్లికి చెందిన ఇలియాస్ దగ్గర ఫోన్ ఉందని గుర్తించి ఫోన్‌ను హరిసింగ్ భార్య హరితకు అందజేశారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74300	రూ.68,500	రూ.890

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : స్త్రీ-2 (హిందీ) (12.30, 3.45, 7.00, 10.15)
స్క్రీన్-2 : శంకర్ దాదా ఎంబిబిఎస్ (12.00, 7.00)
: తంగాలన్ (3.40)
: ఇంద్ర (10.40)
స్క్రీన్-3 : స్త్రీ-2 (హిందీ) (10.00)
: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (1.15)
: ఖేల్ ఖేల్ మెన్ (హిందీ) (4.20)
: తంగాలన్ (7.20)
: మిస్టర్ బచ్చన్ (10.40)
స్క్రీన్-4 : డబుల్ ఇస్మార్ట్ (1.00)
: కమిటీ కుర్రాళ్లు (4.25)
: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.40)
: వేధ (హిందీ) (10.45)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : తంగలాన్ (10.25, 1.25, 7.25, 10.30)
: మిస్టర్ బచ్చన్ (4.25)
స్క్రీన్-2 : ఇంద్ర (10.05)
: డబుల్ ఇస్మార్ట్ (1.20)
: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (4.30)
: స్త్రీ-2 (హిందీ) (7.30, 10.25)
స్క్రీన్-3 : ఇంద్ర (12.55, 7.05)
: స్త్రీ-2 (హిందీ) (4.10)
: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (10.20)

దేవి : తంగలాన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మిస్టర్ బచ్చన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ :

- నిజామాబాద్ అర్బన్